క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ


పాషాను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా సతిమణి ఆకస్మికంగా మృతి చెందడంతో ఆదివారం పాషా కుటుంబ సభ్యులను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్ పరా మర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహా, లక్ష్మణ్, శ్రీకాంత్ సింగ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గోరింటాకు వేడుక


చంద్రదనలో గోరింటాకు పండుగలో మహిళలు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చంద్రదన గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో ఉత్సాహంగా గోరింటాకు పండుగను నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో మహిళా భక్తులు శ్రీలక్ష్మి అష్టోత్తర పారాయణం, మణిద్వీప వర్ణన, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం గోరింటాకు నూరి మహిళలు ఒకరినొకరు పెట్టుకుని సంతోషం వ్యక్తం చేశారు.

మహంకాళి దేవికి మంచిరెడ్డి పూజలు


ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న కులపెద్దలు

ఇబ్రహీంపట్నం రూరల్: మహంకాళి బోనాలను పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయం కోసం కృషి

నాగర్‌కర్నూల్ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్


సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీసింగ్

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు పని చేయాలని నాగర్‌కర్నూల్ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ పేర్కొన్నారు. కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన గ్రామ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బాలాజీసింగ్ హాజరై మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే బలం, బలగమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో ఆమనగల్లు మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రేవంత్‌మిత్రమండలి గ్రామ అధ్యక్షుడు నరేశ్, నాయకులు మధు, యాదయ్య, రామచంద్రయ్య, నర్సింహా, శ్రీశైలం, సురేందర్, మల్లేశ్, నర్సిరెడ్డి, వీరయ్య, వెంకటేశ్, రమేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని శక్తినగర్ కాలనీలో రూ. 38 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాలనీలలో సమస్యలను గుర్తించి ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామన్నారు. రామారావు, అశోక్‌గౌడ్, అజయ్ యాదవ్, ఎండీ.ఖాదర్, వెంకట్‌రెడ్డి, కిష్టయ్య, రాంరెడ్డి, మాలింగం, హర్షవర్ధన్, రాంరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

శాశ్వత భవనాలేవి?

- అద్దె భవనంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- ఇబ్రహీంపట్నం కార్యాలయానికి 2022, ఫిబ్రవరి నుంచి చెల్లించని అద్దె
- మాటలకే పరిమితమైన నిర్మాణ పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బంది, ప్రజలు
- పట్టించుకోని అధికారులు


అద్దె భవనంలో కొనసాగుతున్న ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేసిన నాటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. క్రయవిక్రయదారులు, ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లతో నిత్యం కళకళలాడుతూ ఆదాయం తెచ్చిపెడుతుంది. ఈ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించకపోవడం ప్రభుత్వాల అసమర్థతను రుజువుచేస్తుంది. ఆయా ప్రభుత్వాలు నిర్మాణ పనులకు కసరత్తు చేసిన ఆచరణలోకి రాలేదు. ఆ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇక్కడ వేలాది కోట్ల ఆదాయం సమకూరుతున్న సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చాల చోట్ల కొనసాగుతున్నాయి. అక్కడ ఉండే ఇరుకు గదుల్లోనే సిబ్బంది కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. రోజుకు 70 నుంచి 80 వరకు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయానికి వచ్చే ప్రజలతో పాటు సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేగాకా ఆయా వాహనాల్లో వచ్చేవారికి వాటిని నిలిపేందుకు అక్కడ స్థలం కరువైంది. దీంతో రోడ్లపైనే పార్క్‌చేయడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది.

అచరణలో విఫలం..

శాశ్వత భవనాన్ని నిర్మిస్తామంటూ పాలకులు చెబుతున్నారే తప్ప అచరణలో విఫలమవుతున్నారు. బీఆర్‌ఎస్ హయంలో ఇబ్రహీంపట్నంలోని పాతబస్టాండ్ మున్సిపల్ స్థలంలో నూతనంగా కాంప్లెక్స్‌ను నిర్మించి, ఆ భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలని అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భావించారు. అందుకు అనుగుణంగా కూడా నిర్మాణ పనులు ప్రారంభించి స్లాబ్ వరకు చేపట్టారు. నిధులు మంజూరుకాకపోవడంతో అర్ధంతరంగా పనులు నిలిపేశారు. రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ పాలకులు అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలను శాశ్వత భవనాల్లోకి మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం మూడు విడతల్లో భవన నిర్మాణ పనుల కోసం అందుకు సంబంధించి స్థల అన్వేషణ చెయ్యాలని రెవెన్యూ అధికారులను ఆరు నెలల క్రితం వారు ఆదేశించారు. మంగల్‌పల్లి రెవెన్యూ పరిధిలోని బొంగుళూర్ సమీపంలో 84 సర్వే నంబర్‌లోని 35 గుంటల భూమిని, ఖానాపూర్ సమీపంలో 320 సర్వేనంబర్‌లోని 6 ఎకరాల భూమి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అనుకూలంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందజేశారు. నిర్మాణ పనులకు మాత్రం నేటికి మోక్షం కలగలేదు.

అద్దె గదులకు తాళం..

ప్రతి నెల కోట్లాది రూపాయల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నెలవారి అద్దె చెల్లించడంలో విఫలమవుతున్నారు. రెండు, మూడు నెలల వరకు అద్దె చెల్లించకపోతే ఏ భవన యజమాని ఊరుకోడు. అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆ భవన యజమాని ఇటీవల తాళం వేసిన సంగతి తెలిసిందే. అలాగే ఇబ్రహీంపట్నం కార్యాలయానికి కేవలం రూ.1,950 నుంచి రూ. 2,050 వరకు ఈ 40 నెలల కాలంలో పెరుగుతూ వస్తున్న అద్దె చెల్లించాల్సివుంది. ఇలా తక్కువ అద్దె కూడా ప్రభుత్వం 40 నెలలుగా బకాయిపడడం బాధాకరం.


పాత బస్టాండ్ వద్ద అర్ధంతరంగా నిలిచిపోయిన కార్యాలయం

70 వరకు రిజిస్ట్రేషన్లు



ప్రతి నిత్యం ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 60 నుంచి 70 వివిధ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. నాతోపాటు మరో సబ్ రిజిస్ట్రార్ కూడా ఇక్కడ విధులను నిర్వర్తిస్తారు. ఇక్కడ గదులు ఇరుకుగా ఉండటంతో కొంత ఇబ్బందికరంగా ఉండడం వాస్తవం. శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలాన్వేషణ చేస్తున్నట్లు మాకు సమాచారం ఉంది.

– సోని, సబ్ రిజిస్ట్రార్, ఇబ్రహీంపట్నం

పేదలందరికీ సంక్షేమ పథకాలు

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన చేపడుతుందని ఆయన చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలువురికి సీఎం సహాయనిధి క్రింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని దశలవారీగా అమలు చేస్తుందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. అలాగే అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ జగన్, మాజీ ఎంపీటీసీ జంగయ్య, ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్ తాళ్ల రవీందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్యగౌడ్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

ఎంపీకి వినతిపత్రం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ప్రజల సౌకర్యార్థం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎస్‌టీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లురవిని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపి నివాసంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, విష్ణువర్ధన్, శివరాజులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకుగాను మల్లురవిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలో సబ్ రిజిస్ట్రార్, ఎస్‌టీఓ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.


ఎంపీ మల్లురవికి వినతిపత్రం అందజేస్తున్న యాట నర్సింహా, గుర్రం కేశవులు

అంధత్వ నివారణే లక్ష్యం

సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: అంధత్వ నివారణే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. కల్వకుర్తి పట్టణంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాల సహకారంతో పది రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్య, ఉపాధి, వైద్యం సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 4,400 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 3వేల మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని ఆయన చెప్పారు. ఇందులో ఎంపిక చేసిన 153 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. త్వరలో కల్వకుర్తి నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, నరేందర్‌గౌడ్, యూసుఫ్, గణేశ్, రఘు, యాదయ్య, కొండల్, శేఖర్, రమేశ్ నాయక్, రాఘవేందర్, శివ, శ్రీను, మల్లేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కంటి ఆపరేషన్లు చేయించుకున్నవారితో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తదితరులు

రిజర్వేషన్ల నిర్ణయం అభినందనీయం


తాళ్లపల్లిగూడలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీసీ నాయకులు

- కాంగ్రెస్ యువజన విభాగం నాయకుడు శేఖర్
- సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మంచాల: 42 శాతం బీసీ రిజర్వేషన్ కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ యువజన విభాగం నాయకుడు యశమోని శేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మంచాల మండలంలోని తాళ్లపల్లిగూడ గ్రామంలో బీసీ రిజర్వేషన్ కెబినెట్ సమావేశంలో ప్రకటించడంతో ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ 30 ఏళ్ల కాలంలో ఏ ప్రభుత్వం తీసుకోని నిర్ణయం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గణేష్, నవీన్, లింగస్వామి, కొత్త పల్లి సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా కుమ్మర్ల తొలి బోనాల ఉత్సవం


బోనాల ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామ కుమ్మర్ల తొలి బోనాల ఉత్సవాలు ఆదివారం మన్సూరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, ముద్దగౌని లక్ష్మిప్రసన్న బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి రాంచందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మన్సూరాబాద్ గ్రామంలోని కుమ్మరి సంక్షేమసంఘం భవనం నుంచి పోచమ్మ దేవాలయం వరకు పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలతో కుమ్మరులు బోనాలతో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాంపల్లి హనుమంతు, ఉత్సవ కమిటీ చైర్మన్ నాంపల్లి మల్లేష్, నాంపల్లి శంకరయ్య, బాలరాజు, వెంకటేష్, నాగేష్, గణేష్, నర్సింహ్మా, మహేష్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్ రోడ్డును విస్తరించాల్సి ఉంది

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: రాబోయే తరాల అవసరాల దృష్ట్యా మన్సూరాబాద్ రోడ్డును (బిగ్‌బజార్ చౌరస్తా నుంచి సుష్మా చౌరస్తా వరకు) విస్తరించాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధి కాస్మోపాలిటన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో ఐదు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు నాణ్యతతో చెక్కు చెదరకుండా ఉన్నాయని, నేడు ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు కొన్ని రోజులకే పాడైపోతున్నాయన్నారు. కాలనీలో ఉన్న విశాలమైన స్థలంలో కమ్యూనిటీహాల్, ఆటస్థలం ఏర్పాటుకు గతంలోనే ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్ర లక్ష్మినర్సింహా, శ్రీకాంత్, గంజి సత్తయ్య, శ్రీనివాస్, భాస్కర్, గోపాల్, రమేష్, జ్ఞానేశ్వర్, నాయకులు జగదీష్‌యాదవ్, నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.


పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మండల అధ్యక్షుడు గూడ వీరేశ్


ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న నాయకులు

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనేరాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. అదివారం మండల పరిధిలోని కొనాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఇళ్ల, నూతన రేషన్‌కార్డుల మంజూరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంలో ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల్లో అర్హుల ఎంపికలో ఎలాంటి వివక్షత లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అందించే సంక్షేమ పథకాలతో సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో కర్రెడ్ల నర్సింహారెడ్డి, గ్యార సురేష్, సోప్పరి జంగయ్య, రాజశేఖర్, శ్రీనివాస్, జంగయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంను విధుల నుంచి తొలగించాలి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్

షాబాద్: విద్యార్థిపై బూటు కాలుతో తన్ని, చితకబాదిన హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విద్యార్థి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎంను విధుల నుంచి తొలగించాలన్నారు. 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని రాకేశ్‌ను తరగతి గదిలో బంధించి బూటు కాలుతో తన్నడం సరికాదన్నారు. గతంలో హెచ్‌ఎంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని, ఎస్‌ఎంసీ నిధులను కూడా ఆయన పక్కదోవ పట్టిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థిపై దాడి చేసిన విషయమై డీఈఓకు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయడంలేదన్నారు. ఆతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నాగోలు: మోహన్‌నగర్ బస్తీలోని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మోహన్‌నగర్‌లో బస్తీలో పర్యటించగా వివిధ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బోనాల సందర్భంగా గుంతలు మారిన రోడ్లకు మరమ్మతు చేయించాలని కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ సింగ్, రాజ్‌కుమార్ సింగ్, చుక్కయ్య, గోవర్ధన్, జంగయ్య, దినేష్, సుబ్బారావు, మంచి రాజేష్, రామకృష్ణ, రాకేష్, వెంకట్ రెడ్డి, గట్టు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా మహంకాళి బోనాలు


ఇబ్రహీంపట్నం: మహంకాళి ఆలయం వద్ద బోనాలతో మహిళలు


యాచారం: బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

ఇబ్రహీంపట్నం: వైభవంగా మహంకాళి బోనాలు ఇబ్రహీంపట్నంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం ఆషాడ మాసంలో నిర్వహించే ఉత్సవాలను ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామమంతా మైక్‌సౌండ్ రికార్డులతో మారుమ్రోగింది. మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి తరలివచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బ్యాండ్ మేళాలు, మైక్‌సౌండ్ రికార్డులు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్య ఫలహార బండి ఊరేగింపు నిర్వహించారు.

మున్సిపాలిటీ పరిధిలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్ట తండాలో ఆదివారం బంగారు మైసమ్మ బోనాలను గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కల్కి భగవాన్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చౌదర్‌పల్లిలో..

యాచారం: చౌదర్‌పల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం మహంకాళీ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కుర్మ కులస్తులు బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందరర్భంగా బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు పలువురుని ఆకట్టుకున్నాయి.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి గ్రామంలో కుమ్మరులు రేణుక ఎల్లమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. సుమారు 50 కుటుంబాలకు చెందిన కుమ్మరులు తొలి బోనం తీసి తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల మధ్య శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుమ్మర సంఘం నాయకులు ఆదాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు: బోనాల ఊరేగింపు


ఇబ్రహీంపట్నం: పోతురాజుల విన్యాసాలు